క్లుప్తంగా

మరచిపోయిన వాచ్.. భక్తుడి చెంతకు



భక్తుడు సూర్యకు వాచ్ అందజేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న దర్శనార్థం రెండు రోజుల క్రితం క్షేత్రానికి విచ్చేసిన వైజాగ్‌కు చెందిన భక్తుడు సూర్య కొండపైన డార్మెటరీలో నిద్రించాడు. మరుసటి రోజు సుమారు రూ.30 వేలు విలువైన తన వాచ్‌ను డార్మెటరీలో మరచిపోయి వెళ్లిపోయాడు. అయితే భక్తుడు సూర్య ఆదివారం క్షేత్రానికి రాగా, డార్మెటరీలో విధులు నిర్వర్తిస్తున్న సతీష్, హోంగార్డ్ శ్రీనివాస్‌లు అతడికి ఆ వాచ్‌ను అందించారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండండి



ఉచిత వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేత్ర సమస్యలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి చిన్న సమస్య తలెత్తినా వెంటనే వైద్యులతో పరీక్షలు చేయించుకుని మందులు వినియోగిస్తూ కంటి చూపును కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు సూచించారు. ఆదివారం రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు 112 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిపి 11 మందిని శస్త్రచికిత్స నిమిత్తం వేమగిరి ఆసుపత్రికి తరలించారు. మరో 32 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి పండరినాథ్, బొలిశెట్టి సురేష్ తదితరులు సేవలు అందించారు. ప్రతినెలా మూడో ఆదివారం రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని, అవసరమైనవారు వినియోగించుకోవాలని రామారావు కోరారు.

నేడు ప్రభుత్వ భూముల సరిహద్దుల నిర్ధారణ ప్రారంభం

దెందులూరు: రామారావుగూడెంలో పంచాయతీ శివారు మలకచర్ల రామాలయం వద్ద సోమవారం ఉదయం 9 గంటలకు గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఆదివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఒక గ్రామాన్ని రీ సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంలో భాగంగా మలకచర్ల గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వ భూములు జిరాయితీ భూముల హద్దుల నిర్ధారణ లక్ష్యమే రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ప్రభుత్వ జిరాయితీ భూముల సరిహద్దుల నిర్ధారణ యజమానులకు ముందుగా తెలియజేయడం విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ ఉద్యోగులకు సహకరించటంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను వివరిస్తామన్నారు. రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు అమలుపై పూర్తిస్థాయి అవగాహన కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఇప్పటికే రామారావుగూడెం పంచాయతీ శివారు గ్రామాల్లో టాప్ టెన్ ద్వారా గ్రామసభ సమాచారం తెలియజేశామన్నారు. రామారావు గూడెం పంచాయతీ పరిధి శివారు గ్రామాల్లోని రైతులు గ్రామసభకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుమతి కోరారు.

కొబ్బరి, ఆయిల్‌పామ్ చెట్లకు తెల్ల దోమ తెగులు



కొబ్బరి, ఆయిల్‌పామ్ చెట్లకు ఆశించిన తెల్ల దోమ తెగులు

దెందులూరు: కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కనిపించే తెల్ల దోమల వల్ల నష్టపోకుండా ప్రతి రైతు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దెందులూరు నియోజకవర్గ ఉద్యానశాఖాధికారి అన్నారు. తెల్లదోమ ఆకుల్లోని రసాన్ని పూర్తిగా పీల్చి ఆకులు అడుగు భాగాన వల ఆకారంలో గుడ్లను పెట్టి వృద్ధి చెందుతాయని తెలిపారు. వాటికి సంబంధించి అవగాహన కల్పించేందుకు, నివారణ మార్గాలు సూచించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎవరికైనా ఆయిల్‌పామ్, కొబ్బరి ఇలాంటి పంటల్లో తెల్లదోమ సమస్య ఉంటే ఉద్యానవన శాఖ అధికారులు సంప్రదించి వారు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. రైతులు ఉద్యానవన పంటలకు సంబంధించి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించాలన్నారు.

దళారుల చేతిలో 'తెల్ల'బోతున్న పత్తి రైతు

- పోలవరం నియోజకవర్గంలో 4,213 ఎకరాల్లో పత్తిసాగు
- ఏజెన్సీ ప్రాంతంలో కానరాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- గిట్టుబాటు ధరలేక అవస్థలు పడుతున్న రైతులు

బుట్టాయగూడెం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన పత్తి రైతులను దళారులు దోచుకుంటున్నారు. పత్తి కొనుగోలుకు సీసీఐ సెంటర్‌లు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు వారు పండించిన పంట దళారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు పండించిన పత్తి పంటకు కనీసం గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు తూకాల్లో కూడా మాయ చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు పండించే పంటలను దళారులు దోచుకుని వాహనాల్లో తరలిస్తున్నా.. మార్కెటింగ్ శాఖ అధికారులు తమకు ఏమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం అధికారులు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనితో దళారులదే హవా అవుతుందని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దళారుల చేతిలో రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి పంట కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



బుట్టాయగూడెం మండలం వీరమద్దిగూడెం సమీపంలో పత్తిని కోస్తున్న రైతులు



బుట్టాయగూడెం మండలంలో వేసిన పత్తి పంట

నియోజకవర్గంలో 4,713 ఎకరాల్లో పత్తిసాగు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెం, టి. నర్సాపురం మండలాల పరిధిలో ఈ ఏడాది సుమారు 4,713 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. వీటిలో బుట్టాయగూడెం మండలంలో 354 ఎకరాలు, జీలుగుమిల్లి 350, కుక్కునూరు 3600, పోలవరం 80 ఎకరాలు, కొయ్యలగూడెంలో 22, టి. నర్సాపురం 7 ఎకరాలు, వేలేరుపాడు మండలంలో 300 ఎకరాల్లో పత్తి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. అయితే కొయ్యలగూడెం, టి. నర్సాపురం మండలాల్లో రైతులు పండించిన పత్తి పంట విక్రయానికి కాకుండా విత్తనాల కోసం రైతులు పంటలు వేసినట్లు అధికారులు చెప్పారు.

రెండెకరాల్లో పత్తి పంట వేశా



నేను 2 ఎకరాల్లో పత్తి పంట వేశా. సుమారు రూ.40 వేలు వరకూ పెట్టుబడి పెట్టాను. నేను పండించిన పంట ప్రస్తుతం క్వింటాకు రూ.6,500 కొనుగోలు చేస్తున్నారు. దానివల్ల నాకు నష్టమే వస్తుంది. ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల దళారులకే పంట అమ్ముకుంటున్నాం. మాకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేయాలి.

– పూనెం గంగరాజు, పత్తి రైతు, గుళ్లపూడి, బుట్టాయగూడెం మండలం

దళారుల చేతిలో మోసపోవద్దు



రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు. కొంతమంది పెట్టుబడి వ్యాపారుల వల్ల రైతులు పంటను అమ్మకాలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. రైతులకు అన్ని విధాలా సలహాలు, సూచనలు ఇస్తున్నాం. అలాగే రైతులు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కృషి చేస్తున్నాం.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

ఆంధ్రా కాలువను ఆదుకోరూ

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.30 లక్షలతో కాలువ పనులు
- ఇంకా 14 కిలోమీటర్ల మేర జరగాల్సిన పూడిక పనులు
- వృథాగా పోతున్న సాగునీరు
- ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించాలని రైతుల విజ్ఞప్తి



పూడిక పేరుకుపోయి ముళ్లపొదలతో అధ్వానంగా ఉన్న చింతలపూడి మండలంలోని ఆంధ్రా కాలువ



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రా కాలువ మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

చింతలపూడి: తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులో చింతలపూడి మండలంలో ప్రవహిస్తున్న ఆంధ్రాకాలువను మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చే వేసవిలో వర్షాకాలానికి ముందే పంటకాలువల పూడిక తీసి బాగు చేసుకుంటే సాగునీరు చివరి పొలాలకు కూడా చేరడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. గత ఏడాది ఆయకట్టు రైతుల వినతి మేరకు ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు ఆంధ్రా కాల్వ మరమ్మతులకు తన పార్లమెంట్ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో కాల్వను సుమారు 4 కిలో మీటర్ల మేర మరమ్మతులు చేసి కాలువపై రెండు కల్వర్టులు కూడా నిర్మించారు. ఇంకా 14 కిలో మీటర్ల మేర పూడిక తీసి మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది.

దశాబ్దాలుగా నిర్లక్ష్యం

చింతలపూడి మండలం రాఘవాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న ఆంధ్రా కాలువ పూడుకుపోయి దశాబ్దాలు కావస్తోంది. కాలువకు అనేక చోట్ల గండ్లుకూడా పడ్డాయి. అవి పూడ్చమని ఆయకట్టు రైతులు అనేక సంవత్సరాలుగా మొరపెట్టుకుంటున్నా పూడ్చడం లేదు. దీంతో ఏటా కురిసిన వర్షాలకు వరద నీరు పంటపొలాలపై నుంచి ప్రవహించి వృథాగా పోతోంది. ఆంధ్రా కాల్వ కింద మండలంలో 21 చెరువులకు సాగునీరు అందుతుంది. దాదాపు 15 వేల ఎకరాలు సాగు అవుతోంది. చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం వద్ద నిర్మించిన తమ్మిలేరు ప్రాజెక్టు సైతం ఆంధ్రాకాలువ ద్వారా వచ్చే వరద నీటిపై ఆధారపడి ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఎన్‌టీఆర్ కృష్ణాజిల్లా, ఏలూరు జిల్లాల్లో అధికారికంగా 9,169 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రాకాలువ గురించి పట్టించుకోకపోవడంతో కాలువ పూడికతేలి ముళ్ల పొదలు పెరిగి అధ్వానంగా తయారైంది. తక్షణం కాలువకు పూడిక తీసి గండ్లు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆంధ్రా కాలువ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రాకాలువ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు రూ.30 లక్షలు నిధులు మంజూరు చేసి కొంత వరకు పనులు కూడా చేశారు. ప్రస్తుతం ఆయకట్టు రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసి మిగిలిన కాలువ పనులు కూడా పూర్తి చేయాలి.

– గిరి భోగారావు, మాజీ సొసైటీ చైర్మన్, ఆయకట్టు రైతు, చింతలపూడి

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటాలు



రేచర్లలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి గురవయ్య

చింతలపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అహర్నిశలు పోరాడుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ మహాసభ ఆదివారం డి తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గురవయ్య మాట్లాడుతూ ఇటు ప్రజా పోరాటంలో అటు చట్టసభల్లో సీపీఐ నిర్వహించిన పాత్ర గణనీయమైనదని చెప్పారు. మహాసభలో వన సంరక్షణ సమితి సభ్యులకు ఒక హెక్టార్ భూమితో పాటు వ్యక్తిగతంగా చెట్లు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అదే విధంగా రేచర్ల వాటర్ ట్యాంక్ నుంచి కృష్ణుడు గుడి వరకు ఉన్న రోడ్డును సిమెంట్ రోడ్డు వేయాలని సభలో తీర్మానించారు. మహాసభలో ఇటీవల చనిపోయిన జమ్మి శ్రీనివాస్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం శాఖ కార్యదర్శిగా ఇస్తరాకులు వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దొంతా కృష్ణ, ముల్లపూడి కృష్ణ, పూల దాసు, చెంచయ్య, శివయ్య, ముళ్ళపూడి పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పశువులకు ఉచిత వైద్యశిబిరాలు



కొయ్యలగూడెం పశు వైద్యశాల వద్ద మాట్లాడుతున్న డాక్టర్ బీఆర్ శ్రీనివాస్

కొయ్యలగూడెం: పశువులకు సోమవారం నుంచి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల్లో పశువులకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు కొయ్యలగూడెం పశువైద్యశాల వైద్యాధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కొయ్యలగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఏఎంసీ యార్డ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 21వ తేదీన యర్రంపేట, బయ్యన్నగూడెం, 22న సీతంపేట, మంగపతిదేవిపేట, 23న గవరవరం-1, 24న గవరవరం-2, రాజవరం, 25న దిప్పకాయలపాడు, పరింపూడి-3, 26న పరింపూడి-2, 27న కన్నాపురం-1, అచ్యుతాపురం, 28న వేదాంతపురం, రామానుజపురం, కన్నాపురం-2, 30న రాజవరం, పొంగుటూరు, 31న బోడిగూడెం, గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులు, పశువుల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్చి 29, 30 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్



కరపత్రం విడుదల చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: మార్చి 29, 30 తేదీల్లో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల పరిధిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కాసర నర్సిరెడ్డి కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి తిప్పాబట్ల రామకృష్ణ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే 17వ వార్షికోత్సవ, ఉగాది వేడుకల కరపత్రాన్ని ఆదివారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ.10వేలు, జ్ఞాపిక, రెండవ బహుమతి రూ.7 వేలు, జ్ఞాపిక, 3వ బహుమతి రూ. 2వేలు జ్ఞాపిక అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే సాయంత్రం 6 గంటల నుంచి నృత్యాలు, నాటికలు, క్విజ్‌పోటీలు, గద్యపఠన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో దేవళ్ల పాపారావు, కాసర నర్సిరెడ్డి, మల్లవరపు సత్యనారాయణ, తిరుపతి రమేష్‌బాబు పాల్గొన్నారు.

అమిత్ షా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

దెందులూరు: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సభలో అవమానించిన హోం మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కూటమి నాయకులు రాచ మర్యాదలు చేయడం దేనికి సంకేతమని మాల మహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కొవ్వలి కమ్యూనిటీ హాలులో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ద్వంద్వ వైఖరిని విడనాడాలన్నారు. అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై నేటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం దారుణమన్నారు. హోంమంత్రి వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నా ఇప్పటికీ ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోవడం బాధాకరమని జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు.

సరస్వతికి సావిత్రిబాయి పూలే అవార్డు



సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు అందుకుంటున్న భరోతు సరస్వతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న భరోతు సరస్వతికి సావిత్రిబాయి పూలే అవార్డు లభించడం అభినందనీయమని ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్య నాగేశ్వరావు నాయక్, గుగ్గులోతు కృష్ణ నాయక్ ధారావతు కీమియా నాయక్, ధారావతు రాజబాబు నాయక్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ సమావేశంలో అధ్యాపకురాలు సరస్వతికి సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభ అవార్డును ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యారంగంలో సరస్వతి చేస్తున్న సేవలకుగాను ఈ పురస్కారం అందించడం ఆమెకు లభించిన సముచిత గౌరవమని అన్నారు. సరస్వతి గిరిజన లంబాడి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ లంబాడీల సాంస్కృతిక జీవన విధానం అనే అంశంపై పరిశోధన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం ఆమె ప్రతిభకు తార్కాణమన్నారు. ఈమె అనేక పరిశోధనలు చేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని గిరిజన లంబాడి నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



సీఆర్‌రెడ్డి కళాశాలలో కలిసిన 1978-80 బ్యాచ్ ఎం.కాం. విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని సీఆర్ రెడ్డి కళాశాలలో 1978 - 80 సంవత్సరంలో ఎం.కాం విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాల క్యాంపస్‌లో రత్నబాబు వేముల పల్లి, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనాటి మధురస్మృతులను, జీవిత ప్రయాణంలో గడిపిన అనుభవాలను పంచుకున్నారు. అప్పటి పోస్ట్ గ్రాడ్యుయేట్ అధ్యాపకులు కే శ్రీమన్నారాయణ, కేవీఆర్ఎస్ కొండయ్యరావు, షేక్ హుస్సేన్, ప్రొఫెసర్ పీ సుబ్బారావులను పుష్పగుచ్చాలు అందజేసి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అలాగే కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, ఏ.విజయకుమార్‌లను దుశ్శాలువ, పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. లెక్చరర్స్ వారి సందేశాలను, వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. 44 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు ఇలా కలుసుకోవడం గొప్ప విశేషంగా అధ్యాపకులు అభినందించారు. అప్పటి మహిళా విద్యార్థినులు సైతం అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషదాయకమైన విషయమని, భవిష్యత్‌లో మరిన్ని కలయికలు నిర్వహించడానికి కృషి చేస్తామని నిర్వాహకులు రత్నబాబు, సాంబశివరావు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం



డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఆదివారం దేవులపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం: కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వీరి నుంచి రూ.3450 నగదు, ఒక కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు.

జనార్దన స్వామికి 'కల్కి' అలంకరణ



శ్రీ కల్కి అవతార అలంకరణలో శ్రీ జనార్దన స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూనీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష అర్చన నిర్వహించారు. ఈసందర్భంగా జనార్దన గోష్ఠి ప్రతినిధులచే సహస్రనామ పారాయణ జరిపారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి శ్రీ కల్కి అవతార అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

21 నుంచి ఆధార్ శిబిరాలు

భీమడోలు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ నమోదు, సవరణల కోసం ప్రత్యేక ఆధార్ మొబైల్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఆదివారం తెలిపారు. ఆగడాలలంక, పూళ్ల, భీమడోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 21 నుంచి 22వ తేదీ వరకు, చెట్టున్నపాడు, కురెళ్లగూడెం, సూరప్పగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో 23 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ నంబర్లు, ఆధార్ కార్డుల్లోని మార్పులు, సవరణలు ప్రజలు చేయించుకోవచ్చని తెలిపారు.

ప్రజల్లో చైతన్యం రేకెత్తించిన మహనీయుడు వేమన

భీమడోలు: ప్రజాకవి, దార్శనికుడు యోగి వేమన మహా జ్ఞాని అని ఆయన సమాజానికి అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘ సంస్కర్త యోగి వేమన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవవ జీవితానికి చెందిన అనేక నిత్య సత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి వేమన తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న చిరస్మరణీయుడన్నారు. ఆయన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం రేకెత్తించిన మహనీయుడన్నారు.

21 నుంచి సువార్త మహాసభలు

దెందులూరు: దోసపాడులో ఈనెల 21, 22, 23, 24 తేదీల్లో ఏసుక్రీస్తు ఆలయ 48వ వార్షికోత్సవ వేడుకలు, సువార్త మహాసభలు నిర్వహించనున్నట్టు పాస్టర్ సీహెచ్ఎస్ పాదం తెలిపారు. ఆదివారం దోసపాడులో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు దేవాలయంలో సువార్త మహాసభలు నిర్వహిస్తామన్నారు. మహాసభలు కొనసాగే నాలుగు రోజుల పాటు సుదూర ప్రాంతాల నుంచి నలుగురు సువార్తీకులు వాక్య పరిచర్యకు హాజరవుతారని తెలిపారు.